దోమల బెడద.. తీరేదెట్టా

- పారిశుద్ధ్య లోపంతో పెరిగిన దోమల ఉధృతి
- జ్వరాల బారిన పడుతున్న పట్టణవాసులు
- చర్యలు చేపడతామన్న అధికారులు

రాయచోటి టౌన్: జిల్లా కేంద్రంలో దోమల బెడద ఎక్కువైంది. పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో దోమల సంఖ్య వృద్ధి చెందుతోంది. పట్టణమంతా ఇదే పరిస్థితి నెలకొందని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని మురుగు నీరు అక్కడ అక్కడక్కడ పేరుకుపోవడం, పట్టణ మురుగునీరు మొత్తం మాండవ్య నదిలో కలుస్తుండటంతో దోమల సంఖ్య పెరుగుతోంది. ఎక్కడ చూసినా మురుగునీటి కుంటలు, మురుగు కాలువల్లో నిల్వలు ఉండటంతో వాటిని దోమలు ఆవాసాలుగా చేసుకొని స్వైర విహారం చేస్తున్నాయి.


మాండవ్య నదిలో ప్రవహిస్తున్న మురుగునీరు


మురుగునీటిలో కుప్పలు తెప్పలుగా ఉన్న దోమలు

దీంతో ప్రజలకు పగలు, రాత్రి తేడా లేకుండా నిద్ర లేకుండా చేస్తున్నాయి. దోమల పోటు నుంచి రక్షణ కోసం ప్రజలు గుడ్ నైట్, దోమల చుట్టలను ఆశ్రయిస్తున్నారు. అయినా దోమల బెడద తగ్గడంలేదు. దోమల కుడుతుండటంతో ప్రజలు జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టి తమను దోమల బారి నుంచి కాపాడాలని రాయచోటి ప్రజలు కోరుతున్నారు.

దోమల ఉధృతి పెరిగింది



దోమల దాడి నుంచి కాపాడుకోవడం కోసం తిప్పలు పడుతున్నాం. రాత్రి పూట అయితే మరీ ఎక్కువగా ఉంటోంది. మాకు మాండవ్య నది చాలా దగ్గరగా ఉంది. పట్టణంలోని మురుగునీరు మొత్తం మాండవ్య నదిలోకి వస్తుంది. మాండవ్య నదికి ఇరువైపులా పెద్ద కాల్వలు ఉండేవి. వర్షాలకు అవి కొట్టుకుపోవడంతో నది అంతా గుంతలుగా మారింది. దీంతో అక్కడ దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. అధికారులు ఫాగింగ్ చేసి దోమల బారి నుంచి కాపాడాలి. – కల్పన, పాత రాయచోటి

తట్టుకోలేకపోతున్నాం



పగలంతా కష్టపడి పని చేసి ఇంటికి వచ్చి నిద్రపోదామంటే దోమల దాడి ఎక్కువగా ఉంటోంది. దోమల నివారణ కోసం మస్కిటో చుట్టలు వెలిగిస్తే అలర్జీ వస్తోంది. విపరీతమైన దగ్గు. తట్టుకోలేక పోతున్నాం. దీనిపై అధికారులు దృష్టి పెట్టి దోమల లేకుండా చేయాలి. – రఘు, రాయచోటి

'మాండవ్య'ను శుభ్రం చేస్తే చాలు



మా ఇంటికి దగ్గరలో మాండవ్య నది ప్రవహిస్తోంది. ఈ నదిలోకి మురుగునీరు పారుతోంది. మురుగునీరు కారణంగా నదిలో గుంతలు ఏర్పడంతో పందులు చేరుతున్నాయి. దీంతో దోమల బెడదతోపాటు దుర్వాసన వస్తోంది. దీని కారణంగా దోమలు పెరుగుతున్నాయి. అధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి శుభ్రం చేయాలి. – నందిని, రాయచోటి

పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహిస్తాం

కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు తీసుకున్నా. పట్టణంలోని ప్రజల ఇబ్బందులను తెలుసుకొని చర్యలు తీసుకుంటాం. పట్టణ పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తాం. పట్టణంలో దోమల బెడదను నివారణకు అవసరమైన చర్యలు చేపడతాం. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉండేలా కృషి చేస్తా. – శ్రీనివాసులు, కమిషనర్, రాయచోటి

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎన్.ఉమామహేశ్వర రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దవటంలో ఎంపీడీఓగా పనిచేసిన జవహర్ బాబు ఎన్నికల నేపథ్యంలో కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావును సిద్దవటం ఎంపీడీఓగా వచ్చారు.

గాలివీడు ఎస్ఐగా వెంకటప్రసాద్



గాలివీడు : మండల నూతన ఎస్ఐగా యు.వెంకటప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా వెలుగోడు మండలంలో ఎస్ఐ పని చేస్తున్న వెంకటప్రసాద్ బదిలీపై గాలివీడుకు వచ్చారు. మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం మండల పోలీసు సిబ్బంది ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వెంకటశివకుమార్‌ను అన్నమయ్య జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సర్వే

చిన్నమండెం : స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రెండో రోజు ప్రత్యేక శిబిరంలో నిరుద్యోగ యువతపై సర్వే నిర్వహించారు. భారతదేశ సుస్థిరాభివృద్ధికి నేటి యువత పాత్ర కీలకమని బాధ్య ప్రిన్సిపల్ నరసింహులు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా అధికార విద్య లేని నిరుద్యోగ యువత బెస్తపల్లె గ్రామస్తులను అడిగి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సర్వే నిర్వహించారు. అటువంటి నిరుద్యోగ యువతను గుర్తించి వారి వివరాలను పైఅధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నవీన్‌కుమార్, సర్పంచ్ లోకనాథరెడ్డి, గ్రామ పెద్దలు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా తంబెల వేణుగోపాల్‌రెడ్డి



రాజంపేట : ఏపీఐఐసీ స్టేట్ డైరక్టర్‌గా రాజంపేట మండలం మందరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి తంబెల వేణుగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ప్రభుత్వ సీపీబీ కార్యదర్శి యువరాజ్ విడుదల చేశారు. వేణుగోపాల్‌రెడ్డి ఆది నుంచి వైఎస్సార్‌సీపీలో కీలక నేతగా వ్యవహరిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా సుబ్బారెడ్డి

ఓబులవారిపల్లె : జిల్లా వైఎస్సార్ పార్టీ కార్యదర్శిగా సానుగారి సుబ్బారెడ్డికి నియామక పత్రాన్ని శుక్రవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పని చేస్తానన్నారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో నడవాలి

రాయచోటి టౌన్ : ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని హిందూ ధార్మిక సేవా సమితి అధ్యక్షులు బాలబ్రహ్మానంద సరస్వతి అన్నారు. శుక్రవారం రాయచోటి శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి ప్రవచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారి లీలలను వివరించారు. అంతకుముందు ఆలయన ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రత్యేకంగా ఆహ్వానించి ఆయన పేరున స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి స్థానిక భక్తులతోపాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ అధికారులు భోజన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ, ఈఓ డివి రమనారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

సిద్దవటం : మండలంలోని మూలపల్లి గ్రామంలో వెలసిన గజముఖ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివ పార్వతుల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవమూర్తులను అలంకరించి వేదికపైకి చేర్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితుడు సిద్దవటం వెంకట రంగయ్యస్వామి కల్యాణ క్రతువును జరిపించారు. కల్యాణంలో హాజరైన భక్తులకు స్వామి వారి అన్నప్రసాదాలను నిర్వాహకులు అందజేశారు.

రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : పట్టణంలో వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలు, ఆభరణాలు, పట్టు వస్త్రాలు, నిమ్మకాయలతో హారాలతో అందంగా అలంకరించారు. అనంతరం భక్తులకు రాహుకాల పూజ విశిష్టతను వివరించి చెప్పడంతోపాటు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్టు

రాయచోటి టౌన్ : పట్టణంలోని ఠానా వద్ద బెల్ట్ షాపు నిర్వాహకుడు జలీల్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు ఇంటిలో మద్యం అమ్ముతున్నాడనే సమాచారంతో తమ సిబ్బందితో వెళ్లి తనిఖీ నిర్వహించగా ఇంటిలో 10 మద్యం బాటిళ్లు లభించాయని చెప్పారు. బాటిళ్లు స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం


గ్రామంలో సీసీ రోడ్డును వేస్తున్న దృశ్యం

పుల్లంపేట : రామాపురం గ్రామ పంచాయతీలో రూ.4 లక్షలతో శుక్రవారం సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా రోడ్డు లేక నానా ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ నిధులను రోడ్డు నిర్మాణానికి కేటాయించారు. శుక్రవారం గ్రామంలో పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్ లక్ష్మి నారాయణ, శ్రీనివాసులు నాయుడు, బాబు నాయుడు పాల్గొన్నారు.

జిల్లాకే తలమానికంగా 100 పడకల ఆస్పత్రి

ఆస్పత్రికి కుర్చీలు, టేబుళ్లు, ఫ్రీజర్ బాక్స్ వితరణ

రాయచోటి టౌన్ : రాయచోటి 100 పడకల ఆస్పత్రికి రాయచోటి మానవత సంస్థ ఆధ్వర్యంలో 30 కుర్చీలు, రెండు టేబుళ్లు, ఒక బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను వితరణగా అందజేశారు. శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలోని సీనియర్ వైద్యులు బండారు కిరణ్‌కుమార్, మహేశ్వర రాజు, రెడ్డి భాస్కర్ రెడ్డిలకు మానవత సంస్థ సభ్యులు అందజేశారు. రాయచోటి నియోజక వర్గానికే కాకుండా అన్నమయ్య జిల్లాకూ ఈ 100 పడకల ఆస్పత్రి తలమానికగా మారిందని మానవత సంస్థ సభ్యులు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఆస్పత్రికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. మానవత సభ్యులు స్వర్గీయ ఎస్‌వి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సైకం వంశీ వీటిని అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ వెంకటరమణ నాయుడు, రాయచోటి శాఖ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, కో – చైర్మన్ షకీల్, జిల్లా కమిటీ సభ్యులు ఆనందరెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, గౌరవ సలహాదారుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు గుండ్లపల్లె వెంకటేష్, సభ్యులు సుదర్శన్‌రెడ్డి, హరినాథరెడ్డి, నరసింహారెడ్డి, నాగేశారెడ్డి, రుద్రరాజు వెంకటరమణ రాజు, శ్రీకాంత్‌రెడ్డి, చంటి, ప్రసాద్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.


వైద్యులకు బాడీ ఫ్రీజర్, టేబుళ్లు, కుర్చీలు అందజేస్తున్న మానవత సభ్యులు

ఉపాధి పథకంలో అక్రమాలను ఉపేక్షించబోం

ఒంటిమిట్ట : ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగితే ఉపేక్షించబోమని డ్వామా పీడీ యదుభూషన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డ్వామా పీడీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతి పేదవాడికి ఉపాధి కల్పించడమే ఈ పథకం ఉద్దేశమని, అలాగే రైతులు కూడా ఈ పథకం ఉపయోగపడుతుందని అన్నారు. 2022 నుంచి 2023లో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీలో రూ. 12,800 కూలీలకు అదనంగా చెల్లించారని, సిబ్బంది నుంచి రూ.12,800 రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే పంచాయతీ రాజ్ తరపున సీసీ రోడ్లకుగాను అదనంగా రూ. 2 లక్షలు చెల్లించినందుకుగాను రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ విజయభాస్కర్, డీవీఓ యోగాంజనేయులు, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రామచంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషన్ రెడ్డి

వైఎస్సార్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట టౌన్ : తాను చేపట్టే సేవా కార్యక్రమాలకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తి అని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో శుక్రవారం ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా వివిధ గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంగా రాజంపేట, ఒంటిమిట్ట మండలాలకు చెందిన ఇద్దరు దివ్యాంగులు తమ పరిస్థితి తెలిపి ట్రై సైకిల్ కావాలని కోరారన్నారు. ఈ మేరకు వారికి ఆకేపాటి ఫౌండేషన్ తరఫున ట్రై సైకిల్స్‌ను అందజేశామన్నారు. ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందని చెప్పారు. అందువల్లే తమ ఫౌండేషన్ ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పేదలు ఆరోగ్య సమస్యల గురించి పెద్దగా పట్టించుకోరని, అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆకేపాటి ఫౌండేషన్ ద్వారా పేదలకు తమవంతు సహాయ, సహకారాలు చేసేందుకు తాము ఎప్పుడు ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నాగ పృథ్వీరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోలి మురళీరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు నాగ మహేష్‌రెడ్డి, జీవీ సుబ్బరాజు, పోలి వేణు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట టౌన్: దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తున్న ఆకేపాటి సోదరులు

ప్రజల ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

రాజంపేట : ప్రజల ఆరోగ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం రాజంపేట మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం బడ్జెట్‌లో పెద్దపీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కరోనా మహమ్మారి దాటికి తట్టుకోలేక పోతున్న ప్రజానీకాన్ని సకాలంలో టీకాల వేయించి ఎందరో ప్రాణాలను కాపాడిన సీఎం సేవలను ఎన్నటికీ మరవలేమన్నారు. రానున్న ఎన్నికల్లో మెప్మా మహిళలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనరు రాంబాబు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్లు మర్రి రవి, షేక్ సుమియా మునాఫ్, కౌన్సిలర్లు నియమాతుల్లా, తిమ్మారెడ్డి రఘురెడ్డి, డొంకా సూరి, తోట లక్ష్మినారాయణ, ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాపినేని విశ్వనాథరెడ్డి, అరిగెల సౌమిత్రి, డీలరు సుబ్బరామిరెడ్డి, బిల్లా నరేష్, మెప్మా టెక్నికల్ నిపుణుడు గోపినాథ్, సీఓఎస్ భాస్కర్, పద్మావతి, ఆర్పీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట: హ్యాండ్ వాస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

వేతనాల పెంపుపై హర్షం

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు వేతనాలను పెంచడం ఆనందదాయకమని రాష్ట్ర పీటీఐ (పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల)ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హాజీమలంగ్, రాష్ట్ర కార్యదర్శి పరదేశి ఓబన్న పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పీటీఐల వేతనాల పెంపు కోసం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి కృషి చేశారన్నారు.

అంగన్‌వాడీలకు నియామక పత్రాలు అందజేత

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలో ఇద్దరు అంగన్‌వాడీ ఆయాలకు నియామక పత్రాలను మండల వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. మండలంలోని కొండూరు పంచాయతీలోని అగ్రహారం, వెలగచర్ల గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ సెంటర్లకు నూతనంగా ఎంపికైన ఆయాలకు ఆయన నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మభూషన్ రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మురళీకృష్ణ, ఐసీడీఎస్ అధికారిణి రాజేశ్వరి, సూపర్‌వైజర్లు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆకుల నరేంద్ర, ఆకుల చిన్నా కుటుంబాన్ని కొండూరు విజయ్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. యువ నాయకులకు మాతృ వినియోగం కలగడంతో వారి ఇంటి సంతాపం తెలియజేసి, కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, నాయకులు ఏటూరి సురేష్ రెడ్డి, అబ్బిరెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న పెనగలూరు వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి

పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడ్డాం

- డ్వాక్రా రుణాలను మాఫీ చేశాం
- సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి
- వైఎస్సార్ ఆసరా సభలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


ఓబులవారిపల్లె: మెగా చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


రైల్వేకోడూరు అర్బన్: సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కొరముట్ల

ఓబులవారిపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చి మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్ డ్వాక్రా రుణాలను మాఫీ చేశామన్నారు. వైఎస్ జగన్ మాట ఇస్తే నెరవేరుస్తాడనేందుకు ఇది ఉదాహరణ అన్నారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి చంద్రబాబు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని, మహిళలను నమ్మించి మోసం చేశాడన్నారు. 2024లోనూ చంద్రబాబు మోసం చేసేందుకు తోక పార్టీలతో కలిసి వస్తున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండలన్నారు.

పథకాలతోనే మహిళల ఆర్థికాభివృద్ధి

సంక్షేమ పథకాలు అన్ని మహిళల పేరు మీదనే అందిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి చెందితేనే కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ పథకాలను వారికే అధికంగా అందజేస్తున్నారు. ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక సీఎం జగనే అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి విద్య వ్యవస్థను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇస్తూనే ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రాన్ని సంక్షేమంతోపాటు అభివృద్ధిలో ముందు తీసుకెళుతున్న ముఖ్యమంత్రిని ఎదుర్కొనే దమ్ములేక చంద్రబాబు పొత్తుల కోసం పాకులాడటమే కాక వైఎస్ కుటుంబంలో చిచ్చుపెట్టి వేరు చేశారని విమర్శించారు. ఎంత మంది కలిసి వచ్చిన జగన్ ఒక్కడిగానే వస్తాడని మీ చల్లని దీవేనలతో సీఎం అవుతాడని అన్నారు.

పేదలకు, పెత్తందారులకు మధ్యే 2024 ఎన్నికలు

2024 ఎన్నికలు పెత్తందారులకు పేదలకు మధ్య జరుగుతుందని తెలియజేశారు. పేదలకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్ పక్షాన పేదలు, బడుగులు నిలవాలంటూ కోరారు. రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు దృఢ సంకల్పంతో ముందుకు నడుస్తున్నామన్నారు. అనంతరం సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలే అండగా ఉండాలని చెప్పారు. చంద్రబాబుకి ఓటు వేస్తే పథకాలు అందవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ, ఏరియా కో-ఆర్డినేటర్ నిరంజన్, జిల్లా టూరింజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్‌రాజు, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ, సర్పంచ్‌లు పోలి పాపిరెడ్డి, అళ్ల ఈశ్వరయ్య, ఏపీఎం ఆర్ముగం మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీలు వత్తలూరు రోహిణికుమార్‌రెడ్డి, దుర్గాప్రసాద్, కాగితపు సుజాత, రమేష్‌రాజు, నరసింహ, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎన్సీ వెంకటసుబ్బరెడ్డి, మారే సుకుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' పోస్టర్ల ఆవిష్కరణ

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు జగనన్న అమలు చేసిన పథకాలే మనోధైర్యం అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో సిద్ధం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. నియోజకర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన రోడ్లు, రవాణా, సంక్షేమ పథకాలు, నీటి వసతి తదితర అభివృద్ధి అంశాలపై కార్యకర్తలు ప్రజలకు తెలియజేయడానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాలర్ ఎగరేసే విధంగా ప్రజలకు తెలియజేయదానికి ఇదే మంచి అవకాశమని కొరముట్ల తెలియజేశారు. సోషల్ మీడియా కార్యకర్తలు ప్రజలలోకి ప్రతి ఒక్కటి తీసుకెళ్లి పార్టీ ప్రతిష్టతకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో తల్లెం రమణారెడ్డి, సీహెచ్.రమేష్, రౌఫ్, లతీష్, ప్రభాస్, సునీల్, రోషిత్ కార్తిక్, సోషల్ మీడియా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు నాయీ బ్రాహ్మణ సేవాసంఘ క్యాలెండర్‌ను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సేవా సంఘాలు ప్రజలకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేయాలన్నారు. నాయీ బ్రాహ్మణుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సీహెచ్ రమేష్, మహేశ్వర్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవిశంకర్, ఎంపీటీసీ పుష్పలత, ఇనమాల మహేష్, చైతన్య, చందు, సుబ్బరాయుడు, వీరా పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని అటవీశాఖ వారి ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే సిద్దవటం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం విద్యార్థులను సిద్దవటం రేంజ్‌లోని మద్దూరు బీట్ అటవీ ప్రాంతంలోని బటగణపుల కుంట అటవీ ప్రదేశంలోకి తీసుకెళ్లారు. అక్కడ ముఖ్యఅతిథిగా విచ్చేసిన బద్వేల్ ఆర్డీఓ ఆకుల వెంకటరమణ విద్యార్థులకు చిత్తడి నేలల ప్రాముఖ్యత, పర్యావరణంలో వాటి అవసరాన్ని గురించి వివరించారు. అనంతరం సిద్దవటం రేంజర్ బి. కళావతి జీవ వైవిధ్యంలో చిత్తడి నేలల పాత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం అక్కడి రహదారి చుట్టపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి కాల్చివేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ కె.ఓబులేస్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్, సప్తగిరి పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది

'కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

రాయచోటి అర్బన్ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు, డివిజన్ అధ్యక్షుడు నగేష్ గౌడ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం తమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా డిప్యూటీ లేబర్ ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీకాంత్‌నాయక్‌కు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు ఎన్నో రోజులుగా నిరసనలతోపాటు ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, రెగ్యులర్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో యుఈఈయు నేతలు రాజశేఖర్‌రెడ్డి, అశోక్, ఏ.వి.రమణ తదితర కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఆపస్ ఆవిర్భావ దినోత్సవం

రాయచోటి టౌన్ : ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాయచోటి ఎన్‌జీఓ హోంలో ఆ సంఘం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జెండాను ఎగరవేసి వేడుకలు జరుపుకున్నారు. ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో అప్రెంటీస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా గౌరవ అధ్యక్షులు పరుశురాం, జిల్లా సహాయధ్యక్షులు రామాంజనేయరెడ్డి, ఆపస్ నాయకులు పాల్గొన్నారు.